ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు

కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణంకు భూములు దానం చేసిన భూదాతలకు ఆ పాఠశాలలో ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ గత రెండు వారాల క్రితం చేపట్టిన నిరసన ఆందోళన గురువారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏకలవ్య పాఠశాల ఎదురుగా తింటూ వేసి భూదాతల కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ టి.రాందాస్, వైసిపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న బాధితులు

ఉత్సాహంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విజయగౌరి నామినేషన్

-విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

-ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి కదిలొచ్చిన ఉపాధ్యాయులు

- గెలుపుతో ఉత్తరాంధ్రలో చరిత్ర లిఖించాలని వక్తల పిలుపు

నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న విజయగౌరి

ఆర్ఒ హరేంధిర ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న విజయగౌరి, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీలు వీరపు బాలసుబ్రమణ్యం, ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మరలా మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ వీరపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంబిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు.

విజయగౌరి నామినేషన్ ర్యాలీలో అధికంగా మహిళలు పాల్గొన్నారని, పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రెంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో వేల సంఖ్యలో టీచర్లంతా పోరాడినప్పుడు ఎంఎల్‌సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టకపోతే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాదని, ఉపాధ్యాయులకు కష్టాలొచ్చినప్పుడు కనపడని వారు నేడు పోటీకి సై అంటున్నారని తెలిపారు. అటువంటివారిని విద్యావంతులైన టీచర్లు ఓడించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేస్తోందని, పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తేనే దీన్ని అడ్డుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు ఎస్ఎస్.నాగమణి, టిఆర్.అంబేద్కర్, దాసరి నాగేశ్వరరావు, వి.శీలక్ష్మి చినబ్బాయ్, వి.మహేశ్వరరావు, రెడ్డి మోహనరావు, జి.ఈశ్వరరావు, రమేష్ పట్నాయక్, డి.రాము, ఎస్.మురళీ మోహనరావు, భాస్కరరావు, బాబూరావు, కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, గంటి గిరిధర్‌రావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, పద్మ, కుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న వీరపు బాలసుబ్రమణ్యం, చిత్రంలో విజయగౌరి, ఎంవిఎస్.శర్మ, ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల సంక్షేమం అజెండాగా పనిచేస్తా : విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. విద్యా రంగంలో జిఒ 117ను సంపూర్ణంగా రద్దు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానన్నారు. పాఠశాలల మూత ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని గొంతెత్తుతానన్నారు. యాప్‌ల భారం ఉపాధ్యాయులకు ఉండకుండా చేస్తానన్నారు. విద్యారంగాన్ని రక్షించే పోరాటాలు సాగిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిచేలా అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌కు నామపత్రాలు దాఖలు చేశారు.

అట్టహాసంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

డివి.రాఘవులు నామినేషన్

పాల్గొన్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపీమూర్తి

ఏలూరులో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల భారీ ర్యాలీ

ఏలూరు నగరంలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, సిటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా సాగింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వికి అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2007 నుంచి పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలుపొందిన వారు నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథి శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి.రాఘవులు 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎన్నికకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ 20 రోజులు 24 గంటలు పని చేయాలని కోరారు. కూటమి అభ్యర్థికి రాజకీయ, కుల, ధన, బలాలు ఉన్నాయని, మన పిడిఎఫ్ అభ్యర్థికి ప్రజాబలం, కార్యకర్తల బలం, సంఘాల బలం ఉందని తెలిపారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డివి.రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పాలకులు ప్రజల జీవితాలు ఫణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. పాలకుల తప్పుడు విధానాలను ప్రశ్నించి ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శాసనసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఎటువంటి ఉద్యమం చేసినా రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సహకరించేవారని గుర్తు చేశారు. ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు అంటే అంటే ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని, ప్రస్తుతం ఆ సీటు కోసం సంబంధం లేని వారు పోటీ చేస్తున్నారని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుని రాజకీయ పార్టీలవారు లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. దీన్ని తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎస్.బాలాజీ, జ్యోతిబసు, శ్రీదేవి, అరుణకుమారి, రవికుమార్, ముస్తఫా ఆలీ, విజయరామరాజు, రామభద్రం, జయకర్, షరీఫ్, నరేష్, డిఎన్‌విడి.ప్రసాద్, ఎ.రవి, ఎస్ఎన్.రమేష్, జి.రవికిషోర్, బేబీరాణి, జెఎన్‌వి.గోపాలన్, అరుణ్‌కుమార్, ఐవి.సుధాకర్, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుతో ప్రమాణం చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

నామినేషన్ అనంతరం సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు

ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ అధికారులు

840 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి 840 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తహశీల్దారు అల్లు సత్యనారాయణ గురువారం తెలిపారు. రాజవొమ్మంగి నుండి జాతీయ రహదారిపై ఆటోలో రక్షణ కుమార్ అక్రమంగా తరలిస్తున్న 540 కిలోలు రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి రాజవొమ్మంగి గ్రామశివారులో పట్టుకున్నట్లు చెప్పారు. దూసరపాము గ్రామంలో పోతురాజు ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 300 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కరీముల్లా, ఆర్ఐ చెల్లయ్యమ్మ వీఆర్వో సూర్యకాంతం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నానాజీ, సర్వేర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణం మంజూరుపై ఎపిఎం విచారణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని దోసరపాములో రెండు డ్వాక్రా సంఘాలకు వారి తీర్మానం లేకుండా వారి బ్యాంకు ఖాతాల్లో రుణాలు సొమ్ము జమ కావడంపై వెలుగు ఏపిఎం రామజనేయులు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూసరపాము పంచాయితీ సుబ్బంపాడు వివోఏ పరిధిలోని అరుణ, స్రవంతి గ్రూపులు గతంలో రుణం పొందారని చెప్పారు. అయితే ఆ రుణం తీరకుండానే వారి అనుమతి కాని, తీర్మానం కాని లేకుండా వారి గ్రూప్ ఖాతాల్లో యూనియన్ బ్యాంక్ నుండి సొమ్ము జమ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రూపు సభ్యులు ఆందోళన చెంది తమకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏపిఎం వీరాంజనేయులు విలేకరులకు తెలిపారు.

విచారణ నిర్వహిస్తున్న వెలుగు ఎపిఎం

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆమె రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం మండల కేంద్రాలలో ఒక్కొక్క పోలింగ్ స్టేషన్, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన డొంకరాయిలో ఒక పోలింగ్ స్టేషన్, మొత్తం 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ రెండు డివిజన్ల పరిధిలో 4,664 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. 7 జోన్లు, 7రూట్లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికలు అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చి, అనంతరం ఏలూరుకు తరలించడం జరుగుతుందని చెప్పారు. మార్చి 3న ఏలూరులో కౌంటింగ్ జరుగుతుందన్నారు.

రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎక్కడైనా మీటింగులు జరుపుకోవాలనుకుంటే 48 గంటలకు ముందు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఒకే రోజు రెండు పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయని, ఒక్కొక్క పార్టీ వారు ఒక్కొక్క రోజు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రంపచోడవరం తహశీల్దారు పి.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వివి సత్యనారాయణ, మణికంఠ, వివిధ పార్టీల ప్రతినిధులు పెంటపాటి అనంత మోహన్, బుద్ధ వెంకన్న బాబు, కొమ్మిశెట్టి బాలకృష్ణ, చోళ బొజ్జి రెడ్డి, బాలు రెడ్డి, యం.వాణిశ్రీ, చుక్క సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డిఎస్‌పి సాయి ప్రశాంత్

గుండె నొప్పికి సిహెచ్‌సిలో ఉచిత వైద్యం

- అందుబాటులో రూ.50 వేలు విలువైన ఇంజక్షన్

- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండలం కోతులుగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో గుండె నొప్పికి ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆ సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు తెలిపారు. స్థానిక విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ గుండె నొప్పికి గురైన వారు వెంటనే కోతులగుట్ట ఆసుపత్రికి వస్తే ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి రూ.50వేల విలువైన టెనిస్ట్ ప్లేజ్ ఇంజక్షన్ ఇవ్వడం జరుతుందని చెప్పారు. ఇప్పటికే ఎటపాక మండలానికి చెందిన ఒక వ్యకికి గుండెనొప్పి రావడంతో ఆయనకు ఈ టెనిస్ట్ ప్లేజ్ ఇంజక్షన్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉండడంతోనే ఆ వ్యక్తి ప్రాణాన్ని కాపాడగలిగామని తెలిపారు. కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక, మండలాల్లోని గుండె సమస్యలతో బాధపడే వారు వెంటనే కూనవరం సీహెచ్‌సీకి వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ మహేష్‌బాబు కోరారు.

మాట్లాడుతున్న సిహెచ్‌సి సూపరింటెండెంట్ మహేష్‌బాబు

తునికాకు ప్రూనింగ్ పనులు ప్రారంభించాలి

సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం : ఏజెన్సీ ప్రాంతంలో తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంలోగా ఉన్నప్పుడు గిరిజన ప్రాంతాలలో తునికాకు పనులు ఫిబ్రవరి నెలలోనే ప్రారంభించేవారని తెలిపారు. గిరిజనులకు ఉపాధిని కల్పించే ట్రైనింగ్ పనులు చేసిన 30 రోజుల తర్వాత తునికాకు సేకరణ జరుగుతుందని, ఉపాధి హామీ పనులు రాకముందే గిరిజన ప్రాంతానికి ఆదాయ వనరులుగా ఈ తునికాకు ప్రూనింగ్, ఆకుల సేకరించటం చేపట్టాలని కోరారు. ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు చొరవ తీసుకొని తునికాకు ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, మడకం నాగమణి, మడెం బాబు, పార్టీ సీనియర్ నాయకులు తలగని నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని రాజేంద్రపాలెం పంచాయితీ పరిధిలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని డిఎల్‌పిఒ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, పంచాయితీ సర్పంచ్ పీతా సింహాచలం, ఇఒపిఆర్‌డి నాయుడు, పంచాయితీ కార్యదర్శి మౌనికా కమల, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాగ సుధా లక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ గంగాదాసు, ఎఎస్ఎం రాజీవి, క్లూప్ మిత్రాలు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ కుమార్



వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ పరిధిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల జెడ్పిపిఎఫ్ అకౌంట్లను 2024 ఏడాదికి అప్డేట్ చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ కార్యనిర్వాహాధికారికి గురువారం యూటీఎఫ్ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని పాడేరు డివిజన్-2 మండలాల పరిధిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జడ్పిపిఎఫ్ అకౌంట్లను 2024 సంవత్సరానికి అప్డేట్ చేయాలన్నారు. జడ్పిపిఎఫ్ స్లిప్లను విడుదల చేయాలన్నారు.ఉపాధ్యాయుల జడ్పిపిఎఫ్, పార్ట్ ఫైనల్ లోన్లు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి దేముడు, నేతలు పీవీ రమణ, జె దేముడు, నారాయణ, గంగరాజు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పాడేరు టౌన్: సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైనదని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం 2025 మహా న్యూస్ డైరీని ఆవిష్కరించారు. మహా న్యూస్తో పాటు మహా మ్యాక్స్ ద్వారా ప్రజలకు వార్తలను, ఎంటర్ టైన్ మెంట్ అందిస్తూ అలాగే రాబోయే మహాశివరాత్రికి మహా భక్తి న్యూస్ ఛానల్ ప్రారంభిస్తున్న యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి నిజాన్ని నిర్భయంగా ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ఎండికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మహా న్యూస్ చింతపల్లి రిపోర్టర్ సత్తార్, టిడిపి నాయకులు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మి మరణం బాధాకరం: సిపిఐ

ప్రజాశక్తి- చింతపల్లి

సిపిఐ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు గంధం నర్సింగరావు సతీమణి గంధం జయలక్ష్మి హఠాన్మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి ఎం రాము నాయుడు, అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు డి సి హెచ్ క్రాంతి లతో కలిసి చింతపల్లి వచ్చిన ఆయన జయలక్ష్మి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మనోస్థైర్యం కల్పించారు.

ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

-వార్డెన్ సస్పెన్షన్
-టీచర్లకు షోకాజ్ నోటీసులు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు మండలం డోకులూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ నిర్వహణ ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించిన కలెక్టర్ కొరడా ఝళిపించారు. కలెక్టర్ గురువారం మధ్యాహ్నం పాఠశాలకు చేరేసరికి, కొంతమంది విద్యార్థులు ఆరు బయట తిరగడాన్ని చూసి ప్రశ్నించగా సరైన సమాధానం లేదు. వెంటనే వార్డెన్ ను పిలిపించి సంజాయిషీ కోరారు. వార్డెన్ సంజాయిషీ పట్ల అసంతృప్తి వ్యక్తపరచిన కలెక్టర్ వార్డెన్ పి సింహాద్రిని సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం 7, 8, 9 తరగతుల విద్యార్థుల విద్యాభ్యాస తీరును పరిశీలించారు. వారికి పలు రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా బేస్ లైన్ పరీక్షల్లో వారికి కేటాయించిన గ్రేడ్లపై ఆరా తీశారు. అందుకు ఆయా తరగతుల ఉపాధ్యాయులు సరైన సమాధానం చెప్పలేక నీళ్ళు నమిలారు. బేస్ లైన్ గ్రేడ్ల ఆధారంగా విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగు పరచడంలో విఫలమైన ఆయా క్లాస్ టీచర్లను మందలించి వారికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ మెడికల్ లీవ్లో వెళ్తున్న ఇంగ్లీష్ టీచర్తో ఆంగ్ల విద్యా బోధన కుంటుపడుతున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ సదరు ఇంగ్లీష్ టీచర్ రామ్ సాగర్ ను మెడికల్ బోర్డుకు రిఫర్ చేయాల్సిందిగా ఆదేశించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు

పాడేరు:పర్యాటక గమ్యస్థానాలు అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ చెప్పారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చలి అరకు ఉత్సవం 2025లో పాల్గొన్న అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేసి సంబంధిత గ్రామాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీరాజ్, అటవీశాఖ, గిరిజన చట్టాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. పర్యాటకులు గిరిజన ఆవాసాల్లో (హోమ్ స్టే) ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని పర్యాటక ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాన్నారు. ఏజెన్సీలో అడ్వంచర్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాలకు రహదారులు, విద్యుత్తు సదుపాయాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని అన్నారు.

గిరిజన ప్రాంతాలలో కళాకారులను గుర్తించాలని చెప్పారు. అనంతరం జనవరి 31 నుండి మూడు రోజుల పాటు అరకువ్యాలీలో నిర్వహించిన చలి అరకు ఉత్సవాలపై అధికారుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు జ్ఞాపికలను అందజేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి. ఎఫ్. ఓ, పి.వి. సందీప్ రెడ్డి, డి.ఆర్.ఓ. కె.పద్మలత , డి.ఆర్.డి.ఏ . పిడి. వి.మురళి, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయితీ అధికారి పి.ఎస్. కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్

అరకులోయ మండలం చొంపి పంచాయితీ పరిధి గ్రామాలైన కొత్తవలస, మర్రివలస గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సెక్రటరీకి గురువారం రెండోవ వార్డు సభ్యులు బి.కోగేశ్వరరావు, పేసా కమిటీ కార్యదర్శి పి.దశరథ్, సిపిఎం నేత జి.జగన్నాథం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత సంవత్సరం చొంపి గ్రామంలో ట్యాంకు నిర్మాణం చేసి కనెక్షన్ ఇవ్వలేదని చెప్పారు. కొత్తవలస గ్రామంలో బోర్వెల్ వేసి ట్యాంక్ నిర్మించలేదన్నారు.

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు మధ్యలో పనులు ఆపేయడంతో మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేసవి కాలంలో వస్తుండడంలో మంచినీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి వుందని అన్నారు. సమస్య తీవ్ర కాకుండానే ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.పంచాయితీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ లేక అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు అనేక జబ్బుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించించాలని విజ్ఞప్తి చేశారు.



తనిఖీలు చేపడుతున్న డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్

పాఠశాలల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజావొమ్మంగి : మండలంలోని రాజావొమ్మంగి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, లాగరాయి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలల రీ ఆర్గనైజేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు. సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ.సూరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిపై టిడిపి హర్షం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగిన విషయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీ భరత్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్ను విశాఖ డివిజన్గా పేరు మార్పు చేశారన్నారు. 410 కిలోమీటర్ల పరిధిలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కానుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం విజ్ఞప్తిని పరిగణనలో తీసుకున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తాజా నిర్ణయం విశాఖ రైల్వే అభివృద్ధిలో చారిత్రాత్మకమైన ముందడుగుగా నిలిచిపోతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న అచ్యుతరావు

ఎపిజెయు రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా కంచర్ల అచ్యుతరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఎపిజెయు) రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షులు వాసుదేవనాయుడు, ప్రధాన కార్యదర్శి చాలాది పూర్ణ చంద్రరావు, సీనియర్ ఉపాధ్యక్షులు ఎన్ఎస్.వెంకటరమణ, కోశాధికారి ప్రసాద్ గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంఘాలకు చైర్మన్గా ఉన్న కంచర్ల అచ్యుతరావు తమ సంఘానికి గౌరవాధ్యక్షులుగా నియమితులవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ బలోపేతానికి కృషిచేయాలని కోరుతూ ఆయనకి బాధ్యతలు అప్పగించామన్నారు. అనంతరం డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - మధురవాడ : అర్హులకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని అమలు చేసేలా ఒత్తిడి తెస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యాన జివిఎంసి జోన్ - 2 పరిధి మధురవాడ 7వ వార్డు వాంబే కాలనీలో ఇళ్ల స్థలాల కోసం వ్యక్తిగత దరఖాస్తులు పూరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు పేదలకు ఏమూలకూ సరిపోలేదని, కొన్నిచోట్ల నివాసయోగ్యంగా లేవని అన్నారు. అప్పట్లో ఇచ్చిన రూ.లక్షా 80 వేలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదన్నారు. ఆ మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. పేదలను పట్టించుకోని జగన్ సర్కారు ఎన్నికల్లో ఓటమిపాలైందన్నారు. ఈ విషయాన్ని గుర్తెరిగి కూటమి ప్రభుత్వం మెలగాలన్నారు. ఇంటి నిర్మాణ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వాంబే కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఎంఎ.భేగం, జెడి.నాయుడు, బి.కేశవయ్య, పాత్రుడు, కె.జగ్గస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో భీమిలి డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్తో కలిసి ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని, వీలైనంత వేగంగా సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం నిబంధనలను అనుసరించి ప్రజలకు సులభతర విధానంలో సేవలందించాలని చెప్పారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై పూర్తిగా అవగాహన పెంచుకొని విధులు నిర్వర్తించాలన్నారు. అన్యాక్రాంతానికి గురైన భూములను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోపభూయిష్టమైన రికార్డుల నిర్వహణ లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. తాజాగా ఎక్కడైనా ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు తెలిస్తే స్థానిక రెవెన్యూ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో భాగంగా రీ- వెరిఫికేషన్ ఆఫ్ ఫ్రీ హోల్డ్ కేసెస్, ఎంక్రోచ్మెంట్ అఫ్ వాటర్ బాడీస్, ఎంక్రోచ్మెంట్ ఆఫ్ ఆన్ అబ్జెక్షనబుల్ ల్యాండ్స్, యుఎస్సి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, 22ఎ - డి.నోటిఫికేషన్, ఆర్ఓఆర్ అపీల్స్, కోర్ట్ కేసెస్, పిజిఆర్ఎస్, ఆర్టిఐ -2005, పిరియాడికల్ రిపోర్ట్స్ తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

అదే విధంగా గ్రామ సభలలో వచ్చిన పబ్లిక్ గ్రీవెన్స్ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలన్నారు. నిబద్ధతతో పని చేయాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, భీమిలి ఆర్డిఒ సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సర్వే విభాగం ఎడి, కలెక్టరేట్ ఎఒ, ల్యాండ్ సెక్షన్ అధికారులు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, డిటిలు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఈగల్ వింగ్ జోనల్ సిఐగా రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిటీ ఈగల్ వింగ్ జోనల్ సిఐగా ఎస్.రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత అసాంఘిక శక్తుల ప్రేరేపితం వల్ల మత్తు, చెడు వ్యసనాలకు బానిసలై చక్కని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఆయన గతంలో విశాఖపట్నం జిల్లా పరిధిలో 2010 నుండి 2022 వరకు లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, మెరైన్, సైబర్ క్రైమ్, సిఐడి, సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహించారు. 2023లో సిఐగా ప్రమోషన్ తీసుకొని ఏజెన్సీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జి.మాడుగుల సర్కిల్లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు.

నేరాలు ఘోరాలు

110 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలో సీకరి పంచాయతీ పన్నెడా జంక్షన్ వద్ద ముందస్తు సమాచారం మేరకు గురువారం ఎస్ఐ కొల్లి రమణ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. భూసిపుట్టు చింత గురువు నుండి 110 కేజీల గంజాయితో ఆటో వెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో బాలకృష్ణ, కిముడు బాలరాజు ఉన్నారని, కేసు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం ఆర్టిఒ ఆఫీస్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతాత రవి (53) మృతి చెందినట్లు సిఐ చింతా వాసునాయుడు తెలిపారు. సిఐ కథనం ప్రకారం... గొట్టిపల్లి గ్రామానికి చెందిన చింతాడ రవి గంభీరం సమైక్య అపార్ట్మెంట్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇంటి నుంచి విధుల నిమిత్తం రవి ఉదయం 5 గంటలకు బయలుదేరి వెళ్లాడు. గంభీరం ఆర్టిఒ ఆఫీస్ ఎదురుగా ఆటో దిగి రోడ్డు దాటుతుండగా వైజాగ్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం రవిని ఢీకొట్టి వాహనాన్ని ఆపకుండా పరారయ్యారు. రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు కోరాడ శ్రీను గమనించి ఘటన స్థలానికి వచ్చి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమార్తె చింతాడ భవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య పోలమ్మ, కుమార్తె భవాని ఉన్నారు.

సరుకులు అందిస్తున్న సంఘ సభ్యులు

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి జిల్లా అనంతగిరి మండలం బొర్ర పంచాయతీ గేటువలస గ్రామానికి చెందిన బ్రో సంస్థ కార్యదర్శి చిన్న అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని మాతృభూమి సేవ సంఘం కార్యదర్శి గోపాల్ రావు తెలిపారు. మాతృభూమి సేవ సంఘం టీం సభ్యులు దేవ్ సురేంద్ర,జయమ్మ మోహన్ రావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఆ కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా గోపాల్రావు మాట్లాడుతూ, బాధిత పిల్లల చదువులకు మాతృభూమి సేవా సంఘం నుండి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు సామాజిక సంఘం నాయకులు తుమ్మగంటి రామ్మోహన్, తాట్రాజు రాజారావు , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మెడికల్ కళాశాలలో పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హేమలతదేవి మాట్లాడుతూ, ఎంబిబిఎస్ విద్య ఒత్తిడితో కూడి ఉంటుందని యోగా ధ్యానం అవశ్యకత ఎంతైనా అవసరమని చెప్పారు. దీంతో, ఏకాగ్రత, క్రమశిక్షణ, ధైర్యం వంటి లక్షణాలు అలవాటు అవుతాయని పేర్కొన్నారు. మూడు రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని యోగ గురువు పతంజలి శ్రీనివాస్ తెలిపారు.

డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రమాదాల నివారణకు సూచిక డ్రమ్ములు ఏర్పాటు

ప్రజాశక్తి-రంపచోడవరం : జాతీయ రహదారి 516ఇపై సీతపల్లి గ్రామ సమీపంలో మలుపులను యాక్సిడెంట్ స్పాట్గా గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు సూచిక డ్రమ్ములు ఏర్పాటు చేశారు. అల్లూరి జిల్లా ఎస్పీ సూచన మేరకు రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో రంపచోడవరం సిఐ రవికుమార్, ఎస్ఐ వెంకట్రావు, పోలీసు సిబ్బంది వీటిని గురువారం ఏర్పాటు చేశారు. వైట్ కలర్ డ్రమ్ములో ఇసుక నింపిన, డ్రమ్ముకు రేడియం స్టిక్కర్ల అతికించి ఒక క్రమ పద్ధతిలో పెట్టారు. దీనివలన వాహనాల వేగం తగ్గి ప్రమాదాలు అరికట్టే అవకాశం ఉందని ఎస్ఐ వెంకటరావు తెలిపారు. వాహనదారులు దీన్ని గమనించాలని కోరారు.

నేడు కోర్టు ఆవరణలో వేలంపాట

ప్రజాశక్తి-రంపచోడవరం : పలు కేసుల్లోని స్వాధీనం చేసుకున్న వస్తువులను జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 7న శ క్రవారం ఉదయం 10.30 గంటలకు కోర్టు ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు కోర్టు సూపరింటెండెంట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు కేసులలోనూ, రంపచోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులోనూ స్వాధీనం చేసుకున్న వస్తువులను వేలం వేయడం జరుగుతుందని, ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొవాలని కోరారు. వేలంపాటకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకురావాలని, వేలం పాడుకున్న వస్తువులకు వెంటనే రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

ప్రజాశక్తి-పాడేరు:గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ స్పష్టం చేసారు. పంచాయతీలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లో పంచాయతీల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా నుండి హుకుంపేట మండలం మఠం, తీగల వలస, తడిగిరి, ఘట్టుజోరు, మఠం, గడికించుమండ, పాడేరు మండలం కిండంగి, మినుములూరు, గుత్తులపుట్టు, డోకులూరు, కాడెలి, జి.మాడుగుల మండలం పెదలోచలి, పంతాల, గడుతూరు, సుర్మతి, కుంబిడిసింగి గ్రామాల సర్పంచులను ఈనెల 12వ తేదీన విజయవాడ లో జరుగుతున్న పంచాయతీల సర్పంచుల సమావేశానికి పంపిస్తున్నామన్నారు.గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్చించాలని సూచించారు. జిల్లాలో విద్య, వైద్యం, పోషకాహారం, వ్యవసాయం, రహదారి సదుపాయాలు కల్పనకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వికసిత పంచాయతీలకు ప్రభుత్వ పథకాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, ఈ ఓ పి ఆర్ డిలు, నీతి అయోగ్ కోఆర్డినేటర్లు జి.నారాయణరెడ్డి, చైతన్య రెడ్డి సచివాలయం .కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్